సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 24 । జూన్ । 2024



బుసలు కొడుతున్న విషసర్పాలు..

వర్షాకాలం వచ్చిందంటే విష సర్పాల సంచారం అధికంగా ఉంటుందని, పొలం పనులకు వెళ్లే రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

- 8లో



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్ ఆదివారం ఉత్సాహంగా జరిగింది.

- 8లో

వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి వినతి

వేపాడ: అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని, వివిధ సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రులు ఎ.సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్‌లను కలిసి విన్నవించినట్టు వేపాడ మండల వీఆర్‌ఏ సంఘం అధ్యక్షుడు గట్టు వెంకన్న ఆదివారం తెలిపారు. తెలంగాణా మాదిరి ఏపీలో వీఆర్‌ఏలకు పేస్కేల్ వర్తింపజేయాలని కోరామన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను పునఃప్రారంభిస్తామని కలెక్టర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. దీనిని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు పబ్లిక్ గ్రీవెన్స్

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తామని ఐటీడీఏ ఏపీఓ ఎస్.వి.గణేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. గిరిజన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మన్యం పైనాపిల్‌కు.. విశాఖలో గిరాకీ



విశాఖ మార్కెట్‌లో పైనాపిల్ విక్రయిస్తున్న గిరిజనులు

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో పండే పైనాపిల్ నాణ్యమైనది, రుచికరమైనది. కొండపోడు భూముల్లో కేవలం సేంద్రియ పద్ధతిలో సాగయ్యే పంటకు విశాఖపట్నంలో మంచి గిరాకీ ఉంది. సీతంపేట వారపు సంతలో రూ.15 పలికే పండు ధర అక్కడ సైజును బట్టి రూ.30 నుంచి రూ.50 పలుకుతోంది. దీంతో వ్యాపారులకు కాసుల వర్షం కురుస్తోంది. కొందరు గిరిజన యువకులు నేరుగా వ్యాన్‌లలో పంటను తరలించి విశాఖలోని ప్రధాన కూడళ్లలో సరసమైన ధరకే విక్రయిస్తున్నారు. మరికొందరు రాజమండ్రి, అనకాపల్లి మార్కెట్‌కు కూడా తరలిస్తున్నారు. ఈ ప్రాంతంలో సుమారు పదివేల ఎకరాల్లో పంట సాగులో ఉంది. వాతావరణం అనుకూలించడంతో దిగుబడులు బాగున్నాయి. సీజన్ ముమ్మరమయ్యేసరికి ధరలు పతనమవుతుండడంతో లాభాలు రావడంలేదని కుశిమి, వజ్జాయిగూడ, ముత్యాలు తదితర గ్రామాల గిరిజనులు వాపోతున్నారు.

ఐటీడీఏ ప్రోత్సాహం సున్నా...

రెండేళ్ల కిందటి వరకు ఐటీడీఏ అధికారులు గిరిజనుల వద్ద నుంచి పంట కొనుగోలు చేసి రాష్ట్రంలో వివిధ జిల్లాల రైతు బజార్లుకు తరలించి విక్రయించేవారు. వెలుగు, హార్టీకల్చర్ వంటి శాఖలు ప్రోత్సాహించేవి. ఈ ఏడాది అటువంటి పరిస్థితి లేదు. కనీసం గిరిజనులు ఎంత పంట పండించారు, ఎక్కడ విక్రయిస్తున్నారన్న విషయం పట్టించుకోవడంలేదని, రైతులపై అప్పుడే వివక్ష మొదలైందంటూ గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

స్వచ్ఛంద సేవలకు గుర్తింపు

- గుమ్మలూరి విశాలాక్షికి అంతర్జాతీయ పురస్కారం

విజయనగరం టౌన్:'నా ఊరు విజయనగరం' స్వచ్ఛంద సంస్థ అందించిన సేవలకు గుర్తింపు లభించింది. బ్రిటీష్ పార్లమెంట్ ఏటా ఇచ్చే లండన్ ఇంటర్నేషనల్ సమ్మిట్ అవార్డు సంస్థను వరించింది. ఈ నెల 21న లండన్‌లోని హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎర్త్‌గార్డ్ ఎక్సలెన్స్ అవార్డును సంస్థ వ్యవస్థాపకురాలు గుమ్మలూరి విశాలాక్షి అందుకున్నారు. ఈ విషయాన్ని ఆమె ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. లండన్ పూర్వ మంత్రి పాల్‌స్కల్లీ, జనరల్ సెక్రటరీ కె.సి.త్యాగి తదితరుల చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నట్టు పేర్కొన్నారు.

పథకాలను కొనసాగిస్తామన్న హామీ ఆచరించరేం?

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకరరావు



మాట్లాడుతున్న శంకరరావు, పక్కనే గోపాలం

బొబ్బిలి: పథకాలను కొనసాగిస్తామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం ఆచరణలో ఎందుకు ఆలస్యం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకరరావు ప్రశ్నించారు. స్థానిక విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడారు. సీఎంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత పథకానికి సంబంధించిన డబ్బులు నేరుగా మహిళలకు జమయ్యేలా బటన్ నొక్కారని, ఎన్నికల కోడ్ ఉన్నందున వైఎస్సార్ చేయూత డబ్బులు జమచేయవద్దంటూ కూటమి నాయకులు అప్పట్లో కోర్టును ఆశ్రయించారన్నారు. ఇప్పుడు కోడ్ ముగిసినా మహిళల ఖాతాలకు డబ్బులు జమచేయడంలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందన్నారు. ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలు అమలుచేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సీపీఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం అన్నారు.


కానరాని గురువుల సర్దుబాటు

'విజయనగరం మండలం ముడిదాం ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 9 మంది విద్యార్థులే ఉన్నారు. వీరికి బోధించేందుకు అక్కడ ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. వారు ప్రతిరోజు పాఠశాలకు వెళ్తున్నా ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి. విద్యార్థులు ఉన్నచోటకు తమను పంపించాలని విన్నవిస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన శూన్యం.'

గంట్యాడ మండలం వసంత ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్నది నలుగురు విద్యార్థులే. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరినీ సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి.

గంట్యాడ మండలం చినమదుపాడలో ఒకటి నుంచి ఐదోతరగతి వరకు 16 మంది పిల్లలు చదువుతున్నారు. ఈ ఏడాది ప్రవేశాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ ఒక్క ఉపాధ్యాయుడే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ మరో ఉపాధ్యాయుడు అవసరం ఉంటుందన్నది ఉపాధ్యాయవర్గాల మాట.'

- పిల్లల్లేని చోట టీచర్లు...
- టీచర్లు లేని చోట అధిక మంది విద్యార్థులు
- పాఠశాల విద్యలో వింత పరిస్థితి
- టీచర్ల సర్దుబాటును పట్టించుకోని ప్రభుత్వం
- విడుదల కాని జీఓ
- వచ్చేనెలలోనే యూనిట్ టెస్ట్
- సర్కారు బడుల్లో చదివే పిల్లల భవిష్యత్‌పై నీలినీడలు
- గతేడాది 359 మంది గురువుల సర్దుబాటుతో తీరిన బోధన సమస్య



విజయనగరం అర్బన్:

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మారడం సహజం. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం ఏటా విద్యాసంవత్సరానికి ముందే ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తుంది. ఈ ఏడాది ఇంకా ఆ ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి జీవో జారీచేయలేదు. దీంతో ఉపాధ్యాయవర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎక్కువ మంది పిల్లలు ఉన్నచోట తక్కుమంది టీచర్లు, తక్కువ మంది పిల్లలు ఉన్న చోట ఎక్కువ మంది టీచర్లు ఉండడంతో.. కొన్నిచోట్ల పనిభారం పడుతుండగా, మరికొన్నిచోట్ల బోధనకు అవకాశం లేని పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి విద్యాసంవత్సరం మొత్తం కొనసాగితే విద్యార్థులు నష్టపోతారన్న వాదన బలంగా వినిపిస్తోంది. సర్కారు బడుల్లో చదువుతున్నవారు పేద, మధ్యతరగతి వర్గాలకు చెందినవారేనని, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయవర్గాలు కోరుతున్నాయి.

పరీక్ష సమయం ఆసన్నమవుతున్నా...

వచ్చే నెలలో మొదటి యూనిట్ పరీక్షలను ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు నిర్వహించాల్సి ఉంటుంది. అందుకు సిలబస్‌లో ఒక్కో సబ్జెక్టు నుంచి రెండేసి పాఠాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. పిల్లలు ఎక్కువ, ఉపాధ్యాయులు తక్కువ ఉన్న చోట యూనిట్ సిలబస్ పూర్తి చేయలేని పరిస్థితి. అప్పుడే.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్న వాదన వినిపిస్తోంది. టీచర్ల సర్దుబాటు అనే చిన్నపనితో సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉన్నా పట్టించుకోకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి పిల్లల భవిష్యత్తుకు ఆధారమైన విద్యాసంబంధిత పనులపై దృష్టిపెట్టాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు పలువురు తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గతేడాది 359 మంది ఉపాధ్యాయుల సర్దుబాటు

సర్కారు బడుల్లో చదువుకునే విద్యార్థుల బోధనపై గత ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించేది. విద్యాసంవత్సరం ఆరంభానికి ముందే ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేది. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ్య నిష్పత్తిని చూసుకొని దాదాపు 359 మంది ఉపాధ్యాయులను గతేడాది సర్దుబాటు చేసింది. దీంతో క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయుల కొరత తీరింది. తొలుత గుర్తించిన 367 పోస్టులకు 8 మినహా అన్నింటినీ సర్దుబాటు చేసింది. 3 నుంచి 10వ తరగతి స్కూళ్లు, ఉన్నత పాఠశాలల్లో బయాలజీ-56, ఇంగ్లిష్-50, హిందీ-19, మ్యాథ్స్-53, ఫిజిక్స్-32, సోషల్-84, తెలుగు-11, ఎస్‌జీటీలు 54 మందిని సర్దుబాటు చేసింది.

వివరాలు సేకరిస్తున్నాం..

జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య నిష్పత్తి వివరాలను సేకరించాం. ఎక్కడ ఉపాధ్యాయులు అదనంగా కావాలో, ఎక్కడ అధికంగా ఉన్నారో క్షేత్రస్థాయిలో తెలుసుకొనే పనిలో ఉన్నాం. ప్రభుత్వం జీఓ విడుదల చేసిన వెంటనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– ఎన్.ప్రేమకుమార్, డీఈఓ

సర్దుబాటు జీఓ విడుదల చేయని ప్రభుత్వం

పాఠశాల పునఃప్రారంభం తరువాత తొలుత బోధన సమస్యలేకుండా చేయాలి. ప్రస్తుతం అన్ని తరగతుల్లో నమోదైన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు సమతుల్యంగా ఉన్నారా లేదా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో సేకరించాలి. అవసరమైన చోట ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి. కొత్త ప్రభుత్వం దీనికి అనుగుణంగా జీవో విడుదల చేయకపోవడంతో విద్యాశాఖ అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి.

అధికారం వచ్చింది... ఆక్రమించేద్దాం..!

అధికార బలంతో ముందుగా అధికారులపై జులుం ప్రదర్శించడం.. భయకంపితులను చేయడం.. అనంతరం ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించడం.. అక్రమాలకు పాల్పడం.. ఇదీ టీడీపీ నేతల దురాక్రమణ సిద్ధాంతం. ప్రజలు ఇచ్చిన అధికార బలంతో చెలరేగిపోతున్నారు. రైతులు, పశువులు, గ్రామ అవసరాలకు ఉపయోగపడే చెరువులను కబ్జా చేస్తున్నారు. రాత్రికి రాత్రే పొలాలుగా మార్చేస్తున్నారు. దీనికి విజయనగరం మండలం గాజుల రేగవద్ద ఆక్రమణకు గురైన ఊరబంద నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.

- ఊరబందను కబ్జాచేసిన టీడీపీ నేత
- పొలంగా మార్చేసి నీలగిరి మొక్కలు నాటిన వైనం
- దాని విలువ రూ.4కోట్లుగా పేర్కొంటున్న స్థానిక రైతులు
- అశోక్, అదితి గజపతిరాజుల ఇలాఖాలో పెట్రేగిపోతున్న తెలుగు తమ్ముళ్లు
- రెవెన్యూ అధికారులపై అధికార పార్టీ నేతల బెదిరింపు!
- చర్యలకు వెనుకాడుతున్న రెవెన్యూ సిబ్బంది



టీడీపీ నేత పొలంగా మార్చేసిన 1.22 ఎకరాల ఊరబందను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

విజయనగరం రూరల్:

అధికారం వచ్చి నిండా నెల పూర్తికాలేదు.. అప్పుడే టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. అధికారులు, జనంపై దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఐదేళ్లు అధికారానికి దూరంగా ఉన్నామన్న కసితో ఒక పక్క అధికారులను బెదిరిస్తూనే చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణకు తెరతీశారు. నీతి, నిజాయితీలకు మారుపేరని చెప్పుకునే టీడీపీ సీనియర్ నేత అశోక్‌గజపతిరాజు, తాజా ఎమ్మెల్యే, అశోక్ కుమార్తె అదితిగజపతిరాజు కనుసన్నల్లోనే తెలుగు తమ్ముళ్లు విజయనగరం మండల పరిధిలోని పలు గ్రామాల చెరువుల్లో అక్రమమట్టి తవ్వకాలకు పాల్పడుతుండగా, జమ్ము గ్రామంలో ప్రభుత్వ భూములను చదును చేసేస్తుండడం ప్రజలను కలవరపెడుతోంది. గాజుల రేగవద్ద ఉన్న రూ.4 కోట్ల విలువైన ఊరబందను ఆక్రమించేయడం సొంత పార్టీవర్గాలనే విస్మయానికి గురిచేస్తోంది.



టీడీపీ నేత చెరువును పొలంగా మార్చేసి నాటిన నీలగిరి మొక్కలు

కబ్జా పర్వం ఇలా...

విజయనగరం నియోజకవర్గం పరిధిలోని గాజుల రేగ గ్రామ సర్వే నంబర్ 30/3లో 1.22 ఎకరాల ప్రభుత్వ చెరువు ఉంది. దీని విలువ రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం రూ.4 కోట్లు ఉంటుంది. దీనిపై అధికార పార్టీ నేత కన్నుపడింది. అంతే.. కబ్జాకు ఉపక్రమించాడు. రైతులు, పశువులు, జీవాల దాహార్తిని తీర్చే చెరువును మట్టితో పూర్తిగా కప్పేసి పొలంలా చదును చేసేశాడు. అంతటితో ఆగకుండా ఎవరికీ అనుమానం రాకుండా సాగు భూమిగా మలచి చెరువులో నీలగిరి మొక్కలను సైతం నాటేశాడు. రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా చర్యలకు ఉపక్రమించకుండా ఎమ్మెల్యేకూ వాటా ఉందని చెబుతూ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం చెరువు ఆక్రమణ అటు రెవెన్యూ, ఇటు గ్రామ ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

చెరువు కబ్జా ఎమ్మెల్యే దృష్టికి వెళ్లినా...

సర్వే నంబర్ 30/3లో 1.22 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ చెరువును తమ పార్టీకి చెందిన బడా నేతే ఆక్రమించినట్టు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు దృష్టిలో ఉన్నట్టు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారు. ప్రభుత్వ చెరువు కబ్జాకు పాల్పడిన పార్టీ నాయకుడిపై ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడంపై ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూముల కబ్జాలు, అక్రమ మట్టి తవ్వకాలను ఆదిలోనే అడ్డుకుని అశోక్ పేరు నిలబెట్టాలని, లేదంటే ప్రజల్లో చులకన అయిపోతామని చెబుతున్నారు.



కబ్జా చేసిన చెరువు స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్వో జోగారావు, సిబ్బంది

ఆక్రమణల్లో రాజు పాత్ర ఉందా..? లేదంటే స్థానిక నాయకుడే ఆక్రమించి రాజుల పేరు చెబుతున్నాడా అన్న అనుమానాలను కొందరు వ్యక్తంచేస్తున్నారు.

చెరువు ఆక్రమణను అడ్డుకుంటాం



గాజులరేగ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 30/3లో ఉన్న 1.22 ఎకరాల చెరువు ఆక్రమణ తమ దృష్టికి వచ్చింది. ఆక్రమణకు గురైన ఊరబంద స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశాం. గ్రామ రెవెన్యూ అధికారి నివేదిక అందిన వెంటనే తగు చర్యలు తీసుకుంటాం. చదును చేసిన స్థలంలో నాటిన నీలగిరి మొక్కలు తీసి వేయడానికి చర్యలు తీసుకుంటాం.

– పి.వి.రత్నం, తహసీల్దార్, విజయనగరం

డెంగీ సీజన్.. జాగ్రత్త!





గంగాపురం గ్రామ ఆరోగ్య కేంద్రంలో డెంగీ వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంఓ

- జ్వరాల విజృంభణకు అవకాశం
- జిల్లాలో ఇప్పటి వరకు 15 కేసుల నమోదు
- మరో రెండు నెలలు వ్యాప్తికి అవకాశం
- అత్యవసరమైతేనే రోగికి ప్లేట్‌లెట్లు
- అపోహలు వద్దంటున్న వైద్య నిపుణులు

పార్వతీపురంటౌన్: వర్షాకాలం వచ్చింది... నైరుతి రుతుపవనాల రాకతో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఎక్కడికక్కడే నీరు నిల్వ ఉంటోంది. అందులో దోమలు వృద్ధి చెంది జనంపై దాడి చేసే అవకాశం ఎక్కువ. ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. దోమ కాటుతో ప్రజలు వివిధ జ్వరాల బారిన పడే అవకాశం ఉంది. వాటిల్లో ముఖ్యంగా డెంగీ జ్వరం. దీనిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం. వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో సురక్షితం. వ్యాధికి కారణం, లక్షణాలు తదితరాలపై అవగాహన పెంచుకుంటే అసలు డెంగీ బారిన పడకుండా చూసుకోవచ్చు. జ్వరం వచ్చినా వైద్యులను సంప్రదించి తగిన మందులు వాడితే కోలుకోవచ్చన్నది వైద్యనిపుణుల మాట.

అవగాహన లేకుంటే అంతే...

కరోనా ప్రారంభమైనప్పటి నుంచి జ్వరం పేరు చెబితేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు. కరోనా ప్రారంభం కాకముందు డెంగీ జ్వరం ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేది. పలువురు అవగాహన లేకుండా సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. డెంగీ జ్వరంపై ప్రజలకు అవగాహన లేకపోతే ఇల్లు, ఒళ్లు గుల్ల కావాల్సిందే. కొన్ని ఆస్పత్రుల్లో ప్లేట్లెట్స్ పేరిట జ్వరపీడితుల నుంచి రూ.లక్షల్లో రుసుము వసూలు చేస్తున్నారు. డెంగీపై అవగాహన కలిగి ఉండి కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే జ్వరం బారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు.

దోమలు పెరిగే ప్రదేశాలు...

డెంగీ జ్వరాన్ని కలుగజేసే దోమలు మంచి నీటిని నిల్వచేసే ప్రదేశంలో పెరుగుతాయి. వాడి పారేసిన వస్తువులు, నిల్వ ఉండే నీటిలో దోమ పిల్లలు కదులుతూ ఉంటాయి. నీటిని నిల్వచేసే డ్రమ్ములు, తొట్టెలు, గ్లాసులు, రుబ్బురోళ్లు, వాడి పారేసిన టైర్లు, టీ కప్పులు, ప్లాస్టిక్ కప్పులు, వాడి పారేసిన కొబ్బరి చిప్పలు, బొండాలు, ఫ్రిజ్, ఎయిర్ కూలర్స్ వెనుక భాగాల్లో, పూల కుండీలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, నీటి సంపుల్లో దోమల లార్వాలు పెరుగుతాయి.

జిల్లాలో బాధితులు ఇలా..

జిల్లాలో 2021 సంవత్సరంలో 65 మంది, 2022 సంవత్సరంలో 270 మంది, 2023 సంవత్సరంలో 232 మంది, 2024 జూన్ 10వ తేదీ వరకు 15 మంది డెంగీ జ్వరం బారిన పడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటే మున్సిపాలిటీల పరిధిలోనే ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి. పార్వతీపురం, సాలూరు, పాలకొండ తదితర ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి.

డెంగీ జ్వరం లక్షణాలు

- పగటి వేళల్లో కుట్టే ఏడిస్ ఈజిప్ట్ అనే దోమకాటు వల్ల డెంగీ జ్వరం వస్తుంది.
- జ్వరం వచ్చినప్పుడు వాంతులు, తలనొప్పి, కంటిగుడ్డు కదిలినప్పుడు నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతి అయినట్లు అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- ఒంటిపై ఎర్రటి గుల్లలు ఏర్పడి, ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి ఒక్కోసారి రక్తస్రావం జరుగుతుంది.
- రక్తపరీక్ష చేసి ఎలీసా పద్ధతిలో డెంగీ జ్వరాన్ని నిర్ధారణ చేస్తారు.

డెంగీ విషయంలో కంగారొద్దు



ఎలాంటి జ్వరం వచ్చినా ప్లేట్‌లెట్స్ తగ్గటం సహజం. అంత మాత్రానికే రోగులు కంగారు పడకూడదు. సాధారణంగా రక్తంలో 2 లక్షల నుంచి 4.5 లక్షల ప్లేట్‌లెట్స్ ఉంటాయి. వీటి సంఖ్య 40 వేల కన్నా తక్కువగా ఉన్నప్పటికీ ఎలాంటి ప్రమాదం సంభవించదు. బీపీ తగ్గి, కిడ్నీల పనితీరు తగ్గిపోయి, శరీరంపై ఎర్రటి దద్దుర్లు ఏర్పడి అవి పగిలి వాటి ద్వారా రక్తం బయటకు రావడం, మూత్రంలో, దగ్గుతున్నప్పుడు కళ్లద్వారా రక్తం పడిపోతూ ఉంటే అప్పుడు మాత్రమే ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి ఉంటుంది.

– డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, డీఎంఓ, పార్వతీపురం మన్యం

ఉచితంగా వైద్య సేవలు



జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ డివిజన్లలో డెంగీ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నాం. ప్రతిరోజూ వైద్య సిబ్బందిని ప్రైవేటు ఆస్పత్రులకు పంపించి వివరాలు సేకరిస్తున్నాం. ప్రజలు జ్వరాలపై, ప్లేట్‌లెట్స్‌పై ఉన్న అపోహలు వీడి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలకు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

– డాక్టర్ విజయపార్వతి, డీఎంహెచ్‌ఓ, పార్వతీపురం మన్యం

క్లుప్తంగా

పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మృతి


బత్తాల పకీరు నాయుడు (ఫైల్)

గరుగుబిల్లి: మండలంలోని వల్లరిగుడబ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ బత్తాల పకీరు నాయుడు అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. ఈయన భార్య లక్ష్మి వైస్ ఎంపీపీగా వ్యవహరిస్తున్నారు. కొద్ది రోజులుగా పకీరునాయుడు అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూశారు. ఈయన మృతి పట్ల ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, తదితరులు సంతాపం తెలిపారు.

ముగిసిన ఫస్ట్ ఎయిడ్ శిక్షణ


ఫస్ట్ ఎయిడ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ ఆదివారంతో ముగిసింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 20 మంది విద్యార్థులకు డాక్టర్ శ్రీకాంత్, రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ ప్రథమ చికిత్సపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా సీపీఆర్‌పై అవగాహన, విపత్తుల సమయాల్లో గాయాలకు కట్టు కట్టడం, పాముకాటు, తేలుకాటు, గుండెపోటు వచ్చిన వారికి ప్రథమ చికిత్స, కరెంటు షాక్ తలిగిన వారికి, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స మరిన్ని అంశాలపై శిక్షణ ఇచ్చారు. సామాన్యులకు కూడా ప్రథమ చికిత్సపై అవగాహన ఉండి తీరాలని తద్వారా విపత్తుల సమయంలో ప్రథమ చికిత్స చేయవచ్చని రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు అన్నారు. శిక్షణానంతరం చైర్మన్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ బి.మల్లేశ్వరరావు, ఏట నర్సింగరావు, మేనేజర్ గుణాకరరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడలతోనే మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని యువనాయకుడు, క్రీడా ప్రోత్సాహకులు చీమల తారకేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని నాగావళి నది ఒడ్డున ఆదివారం సాయంత్రం తారకేశ్వరరావు తన సొంత ఖర్చులతో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటుతో నిర్మించిన వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల బారిన పడకుండా ప్రతి రోజూ కొంత సమయం ఆటలపై దృష్టి సారించాలని కోరారు. స్థానికంగా ఉంటున్న యువకులు ఆడుకునేందుకు సరైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని, వారి కోసం ఈ ఆట స్థలాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిగా మెలిగి సోదరభావాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంతోష్, సతీష్, భవాని, బుజ్జి, ప్రసాద్, తరుణ్, సాహుకారి శ్రీను, సాయి, చిన్ని జగదీష్, గోపాల్, సుధీర్, కుమార్, సంతోష్‌కుమార్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

నీలమణి దుర్గ ఆలయానికి పోటెత్తిన భక్తులు



పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి ఆలయానికి మంగళవారం తెల్లవారు జాము నుంచే స్థానికులతో పాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు, ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు కూడా చేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹270

బుసలు కొడుతున్న విషసర్పాలు..

- 17 నెలల్లో 1619 మందికి పాముకాటు
- ఇందులో ఆరుగురి మృతి
- జిల్లాలో ప్రారంభమైన వ్యవసాయ పనులు
- రైతులు అప్రమత్తంగా ఉండాలి : వైద్యులు


నాగు పాము

విజయనగరం ఫోర్ట్: గజపతినగరం మండలానికి చెందిన పైడిరాజు అనే వ్యక్తి ఇటీవల పొలానికి వెళ్లాడు. అక్కడ పాముకాటు వేయడంతో కుటుంబ సభ్యులు విజయనగరం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. జామి మండలం అలమండ గ్రామానికి చెందిన జి.కృష్ణ కొద్ది రోజుల కిందట పొలంలో పనిచేస్తూ పాము కాటుకు గురయ్యాడు. వారం రోజుల పాటు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత కోలుకున్నాడు. వీరిద్దరే కాదు.. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది పాము కాటుకు గురవుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఆడపా, దడపా వర్షాలు కురుస్తున్నాయి. మొక్కజొన్న, కూరగాయలు, అరటి, పత్తి, వేరుశనగ, తదితర పంటలు సాగులో ఉన్నాయి. వర్షాకాలంలో విషసర్పాల సంచారం కూడా ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ పనులు చేసేటప్పుడు, కూరగాయలు కోసేటప్పుడు, పంట పొలాలకు నీరు కట్టేందుకు వెళ్లేటప్పుడు రైతులు జాగ్రత్తగా ఉండాలి. ఈ సమయాల్లోనే ఎక్కువగా పాముకాటుకు గురయ్యే అవకాశం ఉంది.

పంట పొలాల్లోనే ఎక్కువ..

సాధారణంగా నిర్జీవ ప్రదేశాలను ఎక్కువగా ఇష్టపడే పాములు ఆహారం కోసం జనారణ్యంలోకి చొచ్చుకు వస్తున్నాయి. చెత్తా చెదారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, పాడుబడిన భవన శిథిలాలు, పూరి గుడిసెలు, గుబురుగా ఉండే పంటచేలల్లో పాములు ఎక్కువగా నివస్తుంటాయి. ఎలుకలు, కప్పలను ఎక్కువగా ఇష్టపడే పాములు పొలాల్లో రాత్రిపూట సంచరిస్తూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

17 నెలల్లో 1619 మంది..

2023 జనవరి నెల నుంచి 2024 మే నెలఖారు నాటికి 1619 మంది పాముకాటుకు గురయ్యారు. వీరిలో ఆరుగురు మృతి చెందారు. వైద్య విధాన్ పరిషత్ అధీనంలో ఉన్న ఏడు ఆస్పత్రులు, వైద్యారోగ్యశాఖ పరిధిలో ఉన్న 48 పీహెచ్‌సీలు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఉంది. ఈ ఆస్పత్రులకు పాము కాటు బాధితులు చికిత్స కోసం వస్తుంటారు. వారందరికీ సిబ్బంది చికిత్స చేసి ప్రాణాలు కాపాడుతున్నారు.

అవగాహన ఉండాలి..

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రైతులకు పాములపై కనీస అవగాహన ఉండాలని వైద్యులు అంటున్నారు. కనిపించే పాములన్నీ విషపూరితం కాదు. కట్లపాము, తాచుపాము, రక్తపింజర, నాగుపాము వంటి 15 శాతం పాములతోనే ముప్పు ఉంది. సరైన సమయంలో చికిత్స పొందితే విషసర్పం కరిచినా ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు.

జాగ్రత్తలు తప్పనిసరి..

రాత్రి వేళ పొలాలకు వెళ్లేటప్పుడు చెప్పులు, టార్చి లైట్లతో పాటు శబ్దం చేసే పరికరాలు వెంట తీసుకుని వెళ్లడం మంచిది. పాముకాటుకు గురైన వారు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. తీవ్ర ఒత్తిడికి గురైతే బీపీ పెరగడంతో పాటు గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. పసర వైద్యం, మంత్రాలు అంటూ అలసత్వం వహిస్తే ప్రాణాలకే ప్రమాదం. పాము కాటు వేయగానే పైభాగంలో గుడ్డతో కట్టాలి. కాటు వేసిన భాగాన్ని కొత్త బ్లేడుతో గాటు రక్తాన్ని లాగేయాలి. వెంటనే సమీప ఆస్పత్రికి తీసుకెళ్లి కరిచిన పాము వివరాలు చెబితే వ్యాక్సిన్ వేస్తారు.

ఆందోళన తగదు..



పాము కాటువేస్తే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అప్రమత్తంగా ఉంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోను యాంటీ వీనమ్ మందు అందుబాటులో ఉంది. రైతులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. పాముకాటు వేసిన వెంటనే వీలైనంత తొందరగా ఆస్పత్రికి తీసుకురావాలి.

– డాక్టర్ బోళం పద్మావతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

2023 జనవరి నుంచి 2024 మే నెలఖారు నాటికి పాముకాటుకు గురైన వారి వివరాలు

నెల	పాముకాటుకు గురైన వారిసంఖ్య
జనవరి	56
ఫిబ్రవరి	44
మార్చి	39
ఏప్రిల్	65
మే	109
జూన్	105
జూలై	166
ఆగస్టు	234
సెప్టెంబర్	166
అక్టోబర్	128
నవంబర్	115
డిసెంబర్	66
జనవరి (2024)	76
ఫిబ్రవరి	54
మార్చి	59
ఏప్రిల్	68
మే	69

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


క్రీడా జ్యోతి వెలిగించి ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు

- నగరంలో ఒలింపిక్ డే రన్
- క్రీడాజ్యోతి వెలిగించి రన్ ప్రారంభించిన ఒలింపిక్ అసోసియేసన్ ప్రతినిధులు

విజయనగరం: అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్ ఆదివారం ఉత్సాహంగా జరిగింది. స్థానిక ఆర్అండ్‌బీ జంక్షన్ నుంచి ప్రారంభమైన రన్ ఎత్తుబ్రిడ్జి మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సాగింది. రన్‌లో పెద్ద ఎత్తున యువత, క్రీడాకారులు పాల్గొనగా.... పాల్గొన్న వారికి నిర్వాహకులు టీ షర్టులు, టోపీలు అందజేశారు. అంతకుముందు ఒలింపిక్ జ్యోతిని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు వెలిగించి, అనంతరం జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడాకారులలో క్రీడాస్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో ఒలింపిక్ డే రన్ నిర్వహించినట్లు తెలిపారు. విజయనగరం జిల్లా రాష్ట్ర స్థాయిలో ముందువరుసలో ఉండేవిధంగా క్రీడలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.


రన్‌లో భాగంగా స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు

జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచే వివిధ విభాగాల్లో మంచి ప్రతిభ కనబరచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్య డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ సాయిదేవమణి, గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లు నరేంద్ర , ఒలింపిక్ సంఘ సభ్యులు భగవాన్‌దాస్, మల్లేశ్వరరావు, రమణ, శ్రీనివాస్, లీల, ఎన్‌సీపీ, స్కేటింగ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అదును ఇదే..


రాజుపేట వద్ద పుడమితల్లికి, వరి వంగడాలకు పూజలు


గుడివాడ సమీపంలో వెదలు జల్లేందుకు దుక్కిచేస్తున్న రైతు


లుంబూరు-గరుగుబిల్లి మధ్య పొలంలో వెద జల్లుతున్న యువ రైతు


శ్రీకాకుళం రోడ్డులో సీడ్ డ్రిల్లర్ యంత్రంలో వరి విత్తనాలు వేసే పనిలో రైతన్న

పంటల సాగులో రైతులు రుతువులను అనుసరిస్తారు. కార్తెల ప్రకారం ముందుకు'సాగు'తారు. వరి సాగుకు అనువైన ఆరుద్ర కార్తె వచ్చి మూడురోజులు కావడంతో విత్తనాలు 'వెద'జల్లేందుకు, నారుమడుల్లో విత్తేందుకు సిద్ధమయ్యారు. కార్తె ప్రకారం పంట సాగుచేస్తే చీడపీడలను తట్టుకోవడంతో పాటు పూర్తి దిగుబడులు వస్తాయని రైతులు విశ్వసిస్తారు. ఆరుద్ర కార్తె వచ్చేనెల 6వ తేదీ వరకు ఉంటుంది. జూలై 6 నుంచి 20వ తేదీ వరకూ పునర్వసు కార్తె, జూలై 20 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు పుష్యమి కార్తెలు కొనసాగుతాయి. ఇవి వరి నాట్లు వేసేందుకు అనువైన నెలలు. ఏరువాక పౌర్ణమిని సంప్రదాయబద్ధంగా పూర్తిచేసిన రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యారు.

– పాలకొండ రూరల్

వైభవంగా సీతారాముల నిత్య కల్యాణోత్సవం


స్వామి సన్నిధిలో తలంబ్రాల సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామికి ప్రాతః కాలార్చన అనంతరం యాగశాలలో విశేష హోమాలు జరిపించారు. అనంతరం వెండి మంటపం వద్ద నూతన వస్త్రాలతో సీతారాములను సుందరంగా అలంకరించి కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. అనంతరం తలంబ్రాల సేవ నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రామక్షేత్రానికి విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, రామగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి జ్యేష్ట మాస ప్రత్యేక పూజలు



తలనీలాల మొక్కుల కోసం బారులు తీరిన భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. జ్యేష్ఠ మాసం ప్రత్యేక ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పుష్పాలంకరణలో ఆదిత్యుని దర్శనం కోసం ఉదయం 6 గంటల నుంచి అనుమతివ్వడంతో దర్శనానికి భక్తులు బారులు తీరారు. దర్శనాలు సజావుగా జరిగేలా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. కేశఖండన శాల టిక్కెట్ల విషయంలో తేడాలు వచ్చినట్లుగా సమాచారం రావడంతో ఆలయ ఈఓ చంద్రశేఖర్ స్వయంగా వెళ్లి తనిఖీ చేశారు. అలాగే అక్కడ విధుల్లో ఉన్న ఓ మహిళ వ్యవహారాన్ని కూడా పరిశీలించారు. అలాగే గ్రామీణ ప్రాంత మహిళలు ఇంద్రపుష్కరిణి వద్ద ప్రత్యేక సంప్రదాయక పూజలు చేసి ప్రత్యేక ప్రసాదాలను స్వామికి నివేదించారు. అలాగే ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. జిల్లాకు చెందిన పలువురు అధికారులు ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఇక ఆదివారం వివిధ దర్శన టిక్కెట్ల విక్రయాలతో రూ.3,08,400, పూజలు విరాళాల ద్వారా రూ.71,749, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.25 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ తెలిపారు.


భక్తులకు బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న మెడికవర్ సిబ్బంది

మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులు

- మూడుసార్లు లోతు దుక్కులు చేపట్టాలి
- మొక్క వయస్సును బట్టి పోషకాలు అందించాలి
- చనిపోయిన చెట్ల స్థానంలో కొత్త అంట్లు వేయాలి
- ఏజెన్సీ కలబోసి ఉన్న జిల్లాలో 4,878 హెక్టార్లో మామిడి సేద్యం


ఈ తరహా మామిడి తోటలకు కోతల అనంతరం యాజమాన్య చర్యలు అసరం


కోత అనంతరం తోటలో లోతు దుక్కు చేపడుతున్న రైతు


తమ్మినేని అమరేశ్వరి

పాలకొండ రూరల్: మామిడి పంట ముగింపు దశకు వచ్చింది. ఇప్పటికే దాదాపు అన్ని తోటల్లో ఫలసాయం పూర్తిగా కోశారు. మిగిలిన తోటల్లో మరి కొన్ని రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. మామిడి కోత అనంతరం తోటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై ఉద్యానశాఖ అధికారి తమ్మినేని అమరేశ్వరి పలు విషయాలు వెల్లడించారు. మామిడి తోటల్లో కాపు పూర్తయిన తర్వాత తొలకరి వర్షాలకు జూన్, జులై నెలల్లో మొదటిసారి.. ఆగస్టులో రెండోసారి.. అక్టోబర్-నవంబర్ నెలల్లో మూడోసారి భూమిలో పదును చూసుకుని దుక్కు చేసుకోవాలి. మొదటి దుక్కుకి వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకిపోయి నేలకోతను అడ్డుకుంటుంది. రెండో దుక్కు కలుపు నివారణకు దోహదపడుతుంది. మూడో దుక్కు పూత రావడానికి దోహదపడుతుంది. నేలలో ఉండే పిండి పురుగులు, పండు ఈగల కోశస్థ దశలు నశిస్తాయి. దుక్కి సాలుకు అడ్డంగా దున్నాలి. తోటలో భూమి వాలును బట్టి ప్రతి 10-15 చెట్లకు చుట్టూ పెద్ద అడ్డ కట్టలు, తోటచుట్టూ గట్లు వేయాలి. దీనివల్ల వర్షపు నీరు, సహజ సత్తువ బయటకు కొట్టుకుపోదు. నేలలో తేమ బాగా ఉంటుంది.

సూక్ష్మ ధాతువులను అందించాలి..

మామిడి తోటలో పలురకాల సూక్ష్మ ధాతు లోపాలు కనిపిస్తుంటాయి. కాయలు కోయడం పూర్తయిన వెంటనే చెట్లు పుంజుకోవడానికి జింక్ సల్ఫేట్ 5 గ్రాములు, యూరియా 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆ తర్వాత సూక్ష్మ ధాతువులైన జింక్, మెగ్నీషియం, ఇనుము, బోరాన్, మాంగనీస్ మిశ్రమ ద్రావణాన్ని తయారు చేసి జూలై, ఆగస్టు నెలల్లో చెట్లు కొత్త ఆకు తొడిగే సమయంలో రెండవసారి పిచికారీ చేయాలి. జింక్ 5 గ్రాములు, మెగ్నీషియం 2 గ్రాములు, మాంగనీస్ సల్ఫేట్ 2 గ్రాములు, ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రాములు, బోరాన్ 2 గ్రాములు, సున్నం 6 గ్రాములు, యూరియా పది గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కొత్తగా అంట్లు నాటాలి....

యాజమాన్య పద్ధతులు అనుసరించని తోటల్లో అక్కడక్కడ చెట్లు చనిపోయి ఖాళీలు ఏర్పడతాయి. ఈ ఖాళీల్లో మొక్క పెట్టేచోట మళ్లీ ఒక మీటరు పొడవు, మీటరు వెడల్పు, మీటరు లోతు సైజులో గుంతలు తీయాలి. గుంతలు తవ్వేటప్పుడు పై అర మీటరు లోతు మట్టిని ఒక పక్కకు.. లోపలి అర మీటరు మట్టిని మరోవైపు వేర్వేరుగా కుప్పలు వేయాలి. పై మట్టికి 100 కిలోల చివికిన పశువుల ఎరువు లేదా 30 కిలోల వర్మీకంపోస్టు, 2 కిలోల సూపర్ ఫాస్ఫేట్ కలపాలి. చెదలు ఆశించకుండా 100 గ్రాముల లిండేన్/ఫాలిడాన్ (5 శాతం) పొడి మందును మట్టి, ఎరువు మిశ్రమానికి కలపాలి. గుంతను మొదట ఈ మిశ్రమంతో నింపాలి. తక్కువైతే పక్కనున్న మట్టితో గుంత నింపుకుని మొక్క నాటే ముందు రోజు గుంటకు నీరు పెడితే పోత మన్ను బాగా కుంగుతుంది. గుంత మధ్య భాగంలో కొంచెం మట్టిని తీసి, అంటు వేర్లకున్న మట్టి కదలకుండా, రాలకుండా ముద్దలా ఉంచి మరికొంత మట్టిని చేర్చి కాంప్యాక్ట్ చేయాలి. మట్టి వదులుగా ఉండరాదు. మొక్క చుట్టూ పల్లెం చేసి నీరు పోయాలి. నాటేటప్పుడు మామిడి అంటు కలయిక భూమిలో పూడ్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నాటిన అంట్లు గాలుల తీవ్రతకు ఊగిపోకుండా మొక్కకు ఇరువైపులా చిన్న కర్రలు కట్టాలి. నాటిన తర్వాత మొక్క కాండం నిటారుగా ఉండాలి. మొక్క చుట్టూ పాదులో నెలకొకసారి నేలను తవ్వి గుల్లపరుస్తూ ఉండాలి. కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసి వేస్తుండాలి. తోటల్లో చెట్ల మధ్య ఖాళీ స్థలం దున్నడం వల్ల నేల గుల్లబారి భౌతిక స్థితి మెరుగుపడుతుంది. నేలలో గాలి బాగా ప్రసరించి మొక్కకు మేలు చేస్తుంది. కలుపు మొక్కల బెడద ఉండదు. నీటికి, పోషకాల వినియోగానికి పోటీ ఉండదు. అంతేగాక నేలలోనే నివసించే హానికర పురుగులు నశిస్తాయి.

సమగ్ర ఎరువుల యాజమాన్యం

- ముఖ్యంగా నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాల్ని సకాలంలో అధికారుల సూచనల మేరకు అవసరమైన మోతాదులో వేయాలి. వయసును బట్టి ఒక్కో చెట్టుకు ఒక సంవత్సరానికి ఏయే ఎరువులు ఎంత మోతాదులో వేయాలో క్షుణ్ణంగా తెలుసుకోవాలి.
- సంవత్సరం వయసు చెట్లకు పశువుల ఎరువు లేదంటే కంపోస్టు 10 కిలోలు, యూరియా 200 గ్రాములు, సూపర్ ఫాస్ఫేట్‌కు 500 గ్రాములు, ఎంఓపీ 150 గ్రాముల వంతున వేసుకోవాలి.
- రెండేళ్ల చెట్లకు ఒక్కోదానికి పశువుల ఎరువు 20 కిలోలు, యూరియా 400 గ్రాములు, సూపర్ ఫాస్ఫేట్ 1000 గ్రాములు, ఎంఓపీ 300 గ్రాములు వాడాలి.
- ఐదేళ్ల వయసు చెట్లకు పశువుల ఎరువు 50 కిలోలు, యూరియా 1000 గ్రాములు, సూపర్ ఫాస్ఫేట్ 2,500 గ్రాములు, ఎంఓపీ 750 గ్రాములు వేయాలి.
- పదేళ్లు ఆపైన వయసున్న చెట్లకు ఒక్కోదానికి పశువుల ఎరువు 1000 గ్రాములు, యూరియా 2000 గ్రాములు, సూపర్ ఫాస్ఫేటు 500 గ్రాములు, ఎంఓపీ 1,500 గ్రాములు వేయాలి. ఈ ఎరువులు ఎరువులను జులై, ఆగస్టు నెలల్లో చెట్టు పాదులో సమానంగా చల్లి నేలలో కలిసేటట్లు చూడాలి..